గగనకుసుమం

'పంతులూ! పంతులుగారోయ్!...' వెనకనించో మొరటు కంఠం చేతి చప్పట్ల సహాయంతో పరుగిడుతూ వచ్చి నా చెవుల్ని తాకింది.

వెనక్కి తిరిగి చూచేను. సెట్టిగారి యింటి గుమ్మంమీద నుంచొని రామిగాడు చెయ్యూపుతున్నాడు రమ్మని.

నన్నేనా? బలే ఆశ్చర్యం వేసింది నాకు. నుంచొని ఇంకెవర్నైనా పిలుస్తున్నాడేమోనని నాలువేపులా పరికించి చూచేను. ఎవ్వరూ లేరక్కడ నేను తప్ప. ఇంత మండుటెండలో-ఇలాంటి సందులో ఇటువంటి సమయంలో నడవడానికింకెవరు సాహసిస్తాడు, నాలాంటి విధిలేని దౌర్భాగ్యుడు తప్ప.

రామిగాడి చేతి ఊపులవేగం ఎక్కువౌతోంది-తొందరగా రమ్మని సంజ్ఞచేస్తూ-ఇంటి లోపలికి వ్రేలుచూపుతూనూ. తప్పకుండా అది నన్నుద్దేశించే. సెట్టి కాబోలు నన్ను పిలిపిస్తోంది. ఈ నిర్భాగ్యదామోదరునితో ఆ అగర్భ శ్రీమంతుడికి అవసరమేం కలిగింది చెప్మా! కనపడ్డప్పుడు నమస్కారం చేస్తే చూపులు కలియని వ్రేలి ఊపుతో మాత్రమే అందుకొనే పెద్దమనిషికి ఈనాడు నాతో మాట్లాడవలసిన అవసరపు పనేం కలిగిందో?. రూపాయలగలగలే గాని పాపాయిల కలకలలేని యిల్లాయె ఎవరికైనా ప్రయివేటు చెప్పించడానికి పిలుస్తున్నాడని తలంచడానికైనా-ఆలోచనలకి అంతు చిక్కలేదు. అక్కడే నుంచుండిపోయేను కొయ్యబారి; కాలుతూన్న కాళ్ల మొరైనా వినకుండా.

'బాబుగారికి మీతో మాటాడాల్సిన పనేందో ఉందంట. ఒక్కసారి దయ చెయ్యండి.' రామిగాడు రానే ఒచ్చేడు దగ్గరకు. నన్ను స్వయంగా తీసుకెళ్లడానికి.

సరిగ్గా పన్నెండు గంటలు. ఎండవేడి జాస్తిగా ఉంది. వేడెక్కిన ప్రకృతి నా స్వేద జలంతో దాహశాంతి చేసుకోవడానికి ప్రయత్నిస్తోంది. వేసవికాలం. నెత్తిపై చినిగిన గొడుగు. కాలం గడచి-ముడుతలు పడి-విశ్రాంతిదశ ఏనాడో దాటిన తమ్ము నిర్దాక్షిణ్యంగా ఉపయోగించుకుంటున్నప్పటికీ నా చెప్పులు మాత్రం నా యందు సేవ్యసేవక భావంచింతించో లేక నాదుర్దశ వలన పొందిన జాలిచేతనో నా కాళ్లను అంటి వదలక ఎండబాధనుండి కొద్దిగా రక్షిస్తోంది. కడుపులో కాలుతోంది. ప్రొద్దున్న కాఫీ నీళ్లు సేవించి బయలుదేరిన ప్రాణి మరి?

"శారదానాథ్"

మనసు ఇంటివైపు శరీరాన్ని లాక్కుపోవడానికి ప్రయత్నిస్తోంది. రామిగాడు 'దయచెయ్యండి' అంటూ సెట్టిగారియింటివైపు త్రోవ చూపిస్తున్నాడు. పిలచినప్పుడు వెళ్లకపోతే ఆ శ్రీమంతుడికేంకోపమొస్తుందో? తీరా వెళితే ఏ సంభాషణలతో ఎంతసేపు నిలబెడ్తాడో? వలలో చిక్కిన చేపలా కొట్టుకుంటోంది నా మనస్సు.

'ఏం రామం! సెట్టిగారెందుకు రమ్మన్నట్టు?'

'ఏమోనండి. నాకు తెల్దు.'

'సరే పద.' ఆలస్యమైన కొద్దీ ఆరాటం ఎక్కువవటంచేత ఆయన్ని చూడడానికే నిశ్చయించేను.

* * *

సెట్టిగారు తూగుటుయ్యాలలో కూర్చున్నారు. ప్రక్కనుంచొని కామయ్య ఆకులకు సున్నంరాసి అందిస్తుంటే ఒక్కొక్కటి ఈనెలుతీసి మడతపెట్టుకొని నోట్లో వేసుకుంటున్నారు. అప్పుడే అన్నంతిన్నట్టుంది 'బ్రేవ్' అంటూ మధ్య మధ్య త్రేన్చుతున్నాడు. ఎదురుగా వెళ్లి 'నమస్కారం బాబూ!' అన్నాను.

'ఓహో. పంతులుగారా! రండి రండి. అలా కుర్చీమీద కూర్చోండి. ఇంతఎండలో బళ్లోనుంచేనా?'

'చిత్తం. తమ రెందుకో పిల్చారంటే...'

'అదేం మర్యాదయ్యా నిలబడే మాట్లాడతారు. కూర్చోండి ముందు, తర్వాత మాట్లాడదాం-పాపం ఎండలో నడిచొస్తున్నట్టున్నారు. ఒరేయ్-కామూ!-రెండు కలర్లు తీసుకురారా-అబ్బే అదేంటయ్యా ఒచ్చి కూర్చోమంటేనూ-'

సెట్టిగారి ఆదరసత్కారాలకి ఆశ్చర్యపోతూ విధిలేక కూర్చున్నాను-అయనవైపు వింతగా చూస్తూ...

'బాబూరావు బళ్లోనే నా పని చేస్తుంటేది పంతులూ?'

'చిత్తం?'

'జీతమెంతిస్తారు?'

'ఏం జీతం బాబూ! అంతా కలిపి 40 రూపాయలు-'

'ఇంతేనా? పాపం-పిల్లలెంతమంది?'

'పిల్లలకి లోటులేదండి. నలుగురున్నారు. ఒక మగపిల్లాడు. ముగ్గు రాడపిల్లలూనూ-'

'ఈ జీతంతో యింతమంది నెలా పోషిస్తున్నారు? మునిసిపాలిటీలో ఎక్కువిస్తారేమో? ప్రయత్నించలేదా!'

'ఒక పది రూపాయ లెక్కువొస్తాయండి. కాని అందులోని ఉద్యోగాలు మా కందరాని నక్షత్రాలు కదండి!'

'ఇంతమంది కౌన్సిలర్లున్నారు. ఎవ్వరూ నీ కీపాటి సాయం చెయ్యలేకపొయ్యేరటయ్యా? పాపం. నేనైతేనా... ఎవర్నైనా వెళ్లడిగేరా?'

'చిత్తం. మాలాంటివాళ్లని చూసే దెవరు బాబూ! మళ్లా ఓట్లు అవుసరం ఒచ్చేవరకూ మేం కనపడతామాండి."

'అదేనయ్యా వీళ్ళతో ఒచ్చిన చిక్కు. అవుసరం తీరేవరకూ కాళ్లావేళ్లా పడి తిరుగుతారు. అవుసరం దాటిపోగానే తెప్ప కాలుస్తారు. మన వార్డు సంగతి చూచేరా? ఎంత అధ్వానంగా ఉందో. రోడ్డుమీద మనుష్యులు నడవలేరు. కాలవల్లో మురికినీరు కదలేదు.'

'బాధ్యతెరిగినవాళ్లైనా కౌన్సిల్లోకొస్తేకదు బాబూ బాగుపడడానికి.'

'ఈ నెలలో ఎలక్షనున్నాయి కదూ మ్యునిసిపాలిటీది. మనవాళ్ళంతా నన్ను

నపుంసకతైలం

అంగ, నరములు బలహీనతచెంది చిన్నదైన, తిర్గి యథాప్రకారమై పూర్తి సౌఖ్య మనుభవించుటకు 45 యేండ్ల ప్రఖ్యాతి చెందినది.

1 సీసా రూ. 10/ వి. పి. రూ 1-0-0.

డా॥ రత్నం సన్స్ మెడికల్ హాల్
మలకపేట బిల్డింగ్సు,
హైద్రాబాద్, దక్కన్.

నిలువబడమంటున్నారు. కాని సాక్ష్యం లేదు. ఏమంటారు?'

సెట్టిగారి మర్యాదల్లోని నిగూఢ రహస్యం ముసుగు తొలగించి బయటకు తొంగిచూచింది. ఇదా సంగతి. ఒక్క నిట్టూర్పు విడిచేను.

'చిత్తం. తమలాంటి పెద్దలు మావార్డుకు కౌన్సిలరవండకన్న కావలసిం దేముంది బాబూ!' మర్యాదకోసం అనక తప్పని మాటలవి.

'హాయిగా ఉండే ప్రాణాన్ని కష్టపెట్టడం ఎందుకని ఆలోచిస్తున్నాను–ఎందుకండీ మనకీ గాడిదబరువు. ఏమంటారు.'

'తమరలా అంటే ఎలా. తమవల్ల ఉపకారాలు పొందవచ్చుని మనవాళ్ళ ఉద్దేశం'

'అదే ఉద్దేశం. అంతా వచ్చి నామెడ విరిచేరు. మొత్తంమీద ఒప్పుకోక తప్పింది కాదు. మీరంతా ఉన్నారుకదా అన్న ధైర్యం కొద్దీ. ఏమంటారు.'

'మనవాళ్ళకి మేలుచెయ్యడానికే గాని మీకెందుకుబాబూ ఈ ఉద్యోగం. ఏదో మీలాంటి వాళ్ళొస్తేనే మాకు త్రోవ కలగడం.' ఎందుకైనా మంచిదని ముందు జాగ్రత్తకన్న మాటలవి. ఏమో? ఎవరికి తెలుసు. ఈయనే కౌన్సిలరైతే డబ్బున్నవాడు కాబట్టి.

'ఏదో భగవంతు డింత మాకు పెట్టేడా? మాకు కావలసిం దింకేముంది? ఏదో కొంతవరకు సాయం చెయ్యడమే కాని. అందులో మీలాంటి వాళ్ళకు ముఖ్యంగా.'

నిజం చెప్పకేం. సెట్టిగారి ఈ ఆఖరి వాక్యం అదో విధమైన ఆశను కలిగించింది నాలో.

రామిగాడు యింతట్లో కలర్లు తెచ్చేడు. 'ఇయ్యరా! పంతులుగారి కియ్.' సెట్టిగారు నావేపు చూపించేరు.

'భోజనంముం డిం దెందుకులెండి.'

'కలరు కేమయ్యా? ఎండలో పడినడిచొచ్చేరు. ఎప్పుడు తిన్నారో ఏమో?'

రామిగాడు కార్కు తీసిచ్చేడు. ఎండదెబ్బకు నాకూ గొంతుక పిడచకట్టిఉండటం చేత–ఆకలి బాగా చేస్తుండడంచేతా–ఎందుకంటూనే రెండుబుడ్లూ త్రాగేను. కొంచెం హృదయంలో శాంతి.

'చూడండి పంతులుగారూ! మన యింటికి దగ్గరేకదూ మనవార్డు మునిసిపల్ స్కూలు–అక్కడైతే యింత కష్టం ఉండదు. సుమారు మైలు నడవాలికదూ యిప్పుడు.

'చిత్తం. చాలా కష్టంగా ఉందిబాబూ రెండుపూటలూ తిరగటం. అక్కడ దొరికితే బ్రతికిపోదును.'

'కాదుటయ్యా మరి. ఇం కెన్నాళ్ళు. ఒక్కనెల కష్టపడండి. అంతే.'

'ఏదో. మీదయ.' ఆయన కలిగించిన ఆశ బాగా అల్లుకుంది హృదయానికి.

'మనకి మనం సాయం చేసుకోడంలో దయేముంది. మీరు మాకు సాయం చెయ్యడం మేము మీకుసాయం చెయ్యడం మన ధర్మం.'

'మీలాంటి పెద్దల సాయం మాకు కావాలి గాని మేం చేసేదేముంటుంది బాబుగారూ.'

'అదేమన్నమాట. ఒకరి సాయం ఇంకొకరికి తప్పకుండా కావాలి. మాటవరుసకిప్పుడు చూడండి. నేను కౌన్సిలరుగా నెగ్గాలంటే మీసాయం తప్పకుండా కావాలి.'

'మావల్లేమౌతుందండి?'

'అదేమన్న మాట. మీరు తలుచుకుంటే మీవాళ్ళ 25 ఓట్లూ మాకు వేయించగలరు. అది చాలదూ. మీరు తలుచుకోవాలిగాని'



[illegible]'

'మీరు ప్రయత్నిస్తారనే నా నమ్మకం. మనం రాకపోతే మనపను లీ మునిసిపాలిటీలో జరుగుతాయనుకోను.'

'ప్రయత్నిస్తాను. అధమం పదైనా వేయించగలననుకుంటాను.'

'అవి చాలు. ఆ మిగిలినవాటికి కూడా ప్రయత్నించి చూడండి.'

'చిత్తం.'

'పాపం. మీ కాలస్యమైనట్టుంది భోజనానికి. క్షమించండి.'

'ఎంతమాటన్నారు? వస్తాను బాబూ శెలవ్.'

'శెలవ్.'

* * *

సరిగ్గా ఒంటిగంట అయింది. సెట్టిగారి దగ్గర శెలవు తీసుకొని తొందరగా యింటివైపు ముఖం త్రిప్పేను. 'పాపం. మన పంతులు చాల శ్రమపడుతున్నాడురా. ఎలాగైనా మునిసిపాలిటీలో వేయించాలి' అన్న సెట్టిగారి మాటలు చెవులకు తగిలి నాలో ఉన్న ఆశల్ని రేకెత్తించేయి. ఆశలు రేపిన ఆనందంలో అతి తొందరగా నడక సాగించేను. ఇన్నాళ్లకు కష్టం తప్పే సూచనలు భగవంతుడు ప్రసాదించేడు. సెట్టిగారి విజయాన్నాకాంక్షిస్తోంది నా హృదయం; ఆలోచనల్లో అంతర్లీనమైంది నా మనస్సు.

'ప్రసాద్! ప్రసాద్!' వనక నుండి ఎవరో పిలుస్తున్నట్టుంది. శర్మ పరుగులాంటి నడకతో నా వైపు వస్తూ నిలబడమని సైగ చేస్తున్నాడు. ఆగక తప్పలేదు విసుగుకుంటూ.

'ఏంరా శర్మా ఎక్కణ్ణించిరా?'

'ఇలా గోవిందు దగ్గరకెళ్ళి యిలా వస్తున్నాను.'

'ఏం? ఏం సంగతి?'

'నీకు తెలుసును కదురా. నేను మన వార్డుకు కౌన్సిలరుగా నిలవబడుతున్నాను. వాడి కాసంగతి చెబుదామని వెళ్ళేను.'

'ఓహో! సెట్టిగారికీ నీకూ పోటీ అన్నమాట! నవ్వుతూ అన్నాను'

'అవున్రా. అతడు డబ్బున్నవాడు. అయినా మీరంతా ఉన్నారన్న ధైర్యంతో నిలబడ్డాను నేను.'

'శర్మా నేనూ థర్డు ఫారందాకా ఒకే బడిలో ఒకే క్లాసులో కలిసి చదివేం. చాలా మంచివాడు. కాని ముక్కుకు సూటిగా పోయేమనిషి. దేశంకోసం చాలా కష్టపడ్డ దేశ సేవకుడు.

'మంచి పని చేసేవ్.'

'నువ్వు తప్పకుండా సాయం చెయ్యాలి. గోవిందు ఓట్లన్నీ వేయిస్తానన్నాడు. నీవి నాకు నమ్మకమే. ఏమంటావ్?'

'అలాగేలే.'

'వస్తాను.' శర్మ ప్రక్క సందులోకి పోయేడు పనుండి. నేనూ నా యింటికి పోయేను ఆలోచనలతో. భోజనం చేస్తూ ఆలోచించేను. శర్మ తనకు చేతనైతే తప్పకుండా సాయం చేస్తాడు. కాని తనగురించిగాని తనవారిగురించిగాని యితరులకు ప్రాధేయపడి కార్యాలు సాధించడానికి ఒప్పుకోడు. అటువంటివాడు నాకేం సాయం చేస్తాడు. సెట్టిగారు తప్పకుండా సాయంచేస్తాడు. సెట్టిగారికే నా ఓట్లు యియ్యడానికి నిశ్చయించేను.

* * *

ఎలెక్షను రోజు రానే వచ్చింది. ప్రొద్దున్నే శర్మ నా దగ్గర కొచ్చి 'ఏంరా ప్రసాద్-మీ బాబులుగాడి ఓటు నువ్వు సెట్టి కిమ్మన్నావుటే!' అని అడిగేడు. 'ఎవడు చెప్పాడ్రా నీకు. అదంతా ఒక స్టంటులే.' అన్నాను. నాకు తెలుసు తే నువ్వుదగా చెయ్యవని. వస్తాను. తొందరగా వస్తావు కదూ పోలింగు బూతుకు. అక్కడ సాయం చెయ్యాలి.' తొందరగా వెళ్ళిపొయ్యాడు అమాయకంగా. ఇంతలో సెట్టిగారి కారు మా యింటి ముందుఆగింది. 'మిమ్మల్ని తొందరగా రమ్మన్నారు' అన్నాడు డ్రైవరు. 'సరే' అని బట్టలు వేసుకొని బయలు దేరాను. పోలింగు స్టేషన్ దగ్గర జనం అప్పుడే చాల మంది మూగి ఉన్నారు. రెండు వైపులా కేన్వాసింగు ప్రారంభమయింది. సెట్టిగారి కారులో నేను దిగడం చూచిన శర్మముఖం ఆశ్చర్యం ప్రకటించింది. 'ఏంరా?' అన్నాడునన్ను చూచి. 'ఏం?' అన్నాను నేను ఎదురుగా. 'ఇదేం టిలా చేసేవ్?' అన్నాడు. 'ఆయన సాయం చెయ్యమని బ్రతిమాలేడు.' అన్నాను. 'మన స్నేహం మరచిపోతున్నావ్', మాట్లాడలేదు నేను. 'సరేలే' అని వెళ్ళిపోయేడు నిస్పృహతో.

సెట్టిగారిప్పించిన సోడాలూ-కాఫీలూ-త్రాగుతూ భోజనమైనా చెయ్యకుండా రహస్యంగా ఆయనతరఫున ప్రోపగాండా చెయ్యటంలో కొన్ని ఓట్లు శర్మప్రక్కనుండి యిటు వేపు త్రిప్పగలిగేను. మా పది ఓట్లూ అనుకున్నట్లు ఖచ్చితంగా ఆయనకే పడ్డాయి. సాయంత్రం 6 గంటలతో పోలింగు పూర్తయింది. ఆ రాత్రే ఓట్లు లెక్క కూడా జరిగింది. సరిగ్గా 5 ఓట్ల మెజారిటీతో సెట్టిగారు గెలిచేరు. శర్మ దీనంగా నా వైపు చూచేడు. నేను ముహం త్రిప్పుకొని సెట్టిగారి మెడలో బ్రహ్మానందంతో పూలదండ వేసేను. ఆయన తరఫు వాళ్ళంతా ఆయన్ను ఎత్తుకొని జయ జయ ధ్వానాలతో యివతలకు తీసుకొచ్చేరు. ఆయన్నింటివద్ద దిగబెట్టి శెలవు తీసుకొని నేనూ యింటికి పోయేను.

ఆ రోజు రాత్రి ఆనందాతిశయంచేత సరిగ్గా నిద్ర పట్టడంలేదు. ఆ దినం పోలింగు స్టేషన్లో నేను పడిన శ్రమ చేసిన ప్రోపగాండా వేయించిన ఓట్లు వివరంగా మా ఆవిడతో వాడినపదం వాడకుండా వర్ణించి చెప్పేను. నాతోపాటు నా భార్య కూడా నిద్రపోలేదు. కళ్లు మూసేసరికి నేనుపడిన శ్రమకు సెట్టిగారు పదిమందిలోనూ నన్ను ప్రశంసిస్తున్నట్టూ- అందరిలోనూ నన్ను గౌరవించినట్టూ—మ్యునిసిపల్ కమీషనరుతో వాదించి మా మ్యూనిసిపల్ స్కూలులోనే 'హెడ్‌మాష్టరుగా వేయించినట్టూ-తోటి మాష్టర్లంతా నన్ను ఈర్ష్యగా చూస్తునట్టూ-శర్మ కనబడ్డ వాళ్ళందరితోనూ నేను చేసినదగా చెప్పి నన్ను నానా రీతులా తిడుతున్నట్టూ-

వైబ్రో
గర్భాశయ రోగనివారిణి

సర్వ గర్భాశయ వ్యాధులను పూర్తిగా పోగొట్టి, సత్సంతానమును కలుగజేయుటలో మా వైబ్రో మిక్కిలి ఘనతవహించినది. అన్ని షాపులలో దొరకును.

రు 2-8-0

KL

కృష్ణా లేబరేటరి
★ బెజవాడ ★

కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.

ఇంకా ఏవో-ఏవో దృశ్యాలు స్వప్నరూపంగా సాక్షాత్కరిస్తున్నాయి. ఎప్పుడు తెల్లవారుతుందా? ఎప్పుడు సెట్టిగారిచే ప్రశంసలు పొందుతానా అన్న ఆతృత నన్నమితంగా ఆవరించింది. తెల్లవారింది. కాలకృత్యాలన్నీ తీర్చి కాఫీ త్రాగి సెట్టిగారింటికి బయలుదేరేను. కాలు తీసి యివతల పెట్టేనో లేదో మా పొరుగింటి విధవామె ఎదురుగా ఒచ్చి 'ఏంబాబూ ఇంత తెల్లారగానే ఎక్కడికి పోతున్నావ్?' అని అడిగింది. నా హృదయం చివుక్కుమంది. గుండె ఝల్లుమనింది. 'ఎక్కడికీ లేదత్తా' అని ఎలాగో అని వెనక్కి తిరిగి మంచంపై కూలబడ్డాను. 10, 15 నిముషాల తర్వాత తొందర తొందరగా యిల్లుదాటి సెట్టిగారింటి వైపు బయలుదేరాను. శర్మ ఎక్కడనుంచో అప్పుడే ఒస్తున్నాడు. వాడు దాటి పొయ్యేవరకు ప్రక్క సందులో దాక్కుని, తరవాత బయలుదేరి సెట్టిగారిల్లు చేరేను. కామయ్యను పిలచి సెట్టిగారేంచేస్తున్నా' రన్నాను.

'రాత్రి నిద్రలేదు-అంచేత పరున్నారు. ఇంకా లేవలే'దన్నాడు.

'సరే' అని బడికివెళ్ళి 10-30 ఎప్పుడౌతుందా అని గడియారానికి కళ్ళనంటించి బడి విడిచిపెట్టగానే పైవేట్లు కానాటికి స్వస్తిచెప్పి సెట్టిగారింటికి చేరేను. అదృష్టవశాత్తూ సెట్టిగారింట్లోనే ఉన్న సూచనలు కనిపించినై ఎవరో స్నేహితులతో కలసి లోపల నవ్వుకుంటున్నారు. బహుశః తమ ప్రత్యర్థికి సంభవించిన అపజయ విశేషాలు తలంచుకొని ఆనందిస్తున్నారు కాబోలు. రామిగాడు కనిపించేడు. విజయానంద సూచకంగా సెట్టిగారు స్నేహితులతో విందారగిస్తున్నారనిన్నీ పదిహేను నిముషాలాగితే కలుసుకోవచ్చుననిన్నీ చెప్పేడు. ఎందుకో మనస్సు కొంచెం బాధపడ్డది. 'సరేలే' అని అక్కడ బల్లపై కూర్చున్నాను. 15 నిముషాలు-అరగంట-ఒకగంట అయింది-మిత్రులొక్కొక్కరూ బయట కొస్తున్నారు. సెట్టిగారుకూడా చివరగా వారి ననుసరించి యివతల కొచ్చేరు. నుంచొని నమస్కారం చేసేను విజయానందసూచకమైన చిరునవ్వుతో-ఆయన వద్దనుండి కృతజ్ఞత నాసిస్తూ. నన్ను చూచి నమస్కారా న్నందుకుని మిత్రులతో కలసి వీధి గుమ్మంలోకి పోయి కబుర్లలోకి దిగేరు. నన్ను తృప్తిపరచడానికి చిన్న చిరునవ్వైనా కనుపించలేదా ముఖంలో. సెట్టిగారిలోని యీ నిర్లక్ష్యభావానికి నేను నిర్విణ్ణుణ్ణయి కొయ్యబారి పోయేను. హృదయంలో రేగిన తుఫానుకు మెదడులో కట్టిన మేడలు కూలిపడుతున్నై.

అక్కడ నిలువలేకపోయేను. ఎదురుగా ఒచ్చి 'శలవు తీసుకుంటాను బాబూ' అన్నాను సెట్టిగారివంక తిరిగి. 'ఇంకా కమీషనర్ను కలుసుకోలేదయ్యా! కలిస్తే నీసంగతి చెప్తానులే' అన్నాడు. 'చిత్తం' అని మాత్రం అని గిరున తిరిగి యింటి ముహాం పట్టేను. 'ఓటు యిచ్చినందుకుద్యోగ మిప్పించాలటయ్యనకు' అన్న సెట్టిగారి మాటలు నా తలపై గాఢంగా గొడ్డలి వ్రేట్లు వేసేయి. గుండె బరువెక్కింది. కాళ్ళీడ్చుకుంటూ యిల్లుచేరేను. ఆ దినం భోజనం రుచించలేదు. మంచంపై బోర్లా పడిపోయేను. ఆపినా ఆగకుండా హృదయంలోంచి దుఃఖం బయట కుబికుబికి వస్తాంది. నానించి మా ఆవిడ కూడా ఆదినం భోజనం చెయ్యలేదు. జరిగిన విషయాన్నావిడకు చెప్పడానికి సాహసించలేకపొయ్యేను. ఆ రాత్రంతా నిద్రపట్టలేదు. శర్మ నాకళ్ళెదుట చిన్నబోయిన ముఖంతో సాక్షాత్కరిస్తున్నాడు. అతని స్నేహితులు నాస్థితికి నవ్వుతూ నా చుట్టూ నృత్యం చేస్తున్నారు. కాలం బరువుగా గడచింది. ఎట్టకేలకు తెల్లవారింది. విధిలేక కాలకృత్యాలు తీర్చి బడికి బయలుదేరేను. సెట్టిగారు గుమ్మంలో నుంచొని కాలువలు తుడిచేవాడిని గద్దిస్తున్నారు-తన కాలవ సరిగ్గా తుడవటంలేదని. నమస్కరించేను. అందుకొని 'కమీషనర్ని కలిసేనయ్యా. ఖాళీ లేవీ లేదన్నాడు.' అని మాత్రం అని లోపలికి వెళ్ళిపోయేడు. రామిగాడు లోపల్నుంచి ఎవరితోనో నవ్వుతూ అంటున్నాడు 'ఓటిస్తే ఉద్యోగాలొస్తాయనుకున్నాడు పిచ్చిపంతులు' తగిలిన గాయంపై మరొక్క గాయం. తల దిమ్మగా ఉంది. చెవులు మూసుకొని శిరసు ఒంచుకొని నడక జోరుచేసేను. కొంతదూరము పోయి తలెత్తి మాడ్నుకదా పాఠశాలత్రోవ తప్పి ప్రక్కత్రోవలో పడ్డాను. శర్మ యిల్లా సందులోనే ఉంది. తిన్నగా అతని యింటికి పోయేను శర్మకాళ్ళపై పడి క్షమాపణ చెప్పుకుందామని... ★

పెట్రర్ సేల్సు అండ్ సర్వీస్
ఆంధ్ర ఎలక్ట్రికల్ హౌస్ లిమిటెడ్.,
హెడ్డాఫీసు: ఏలూరు - విజయనగరం
ఫోన్: నెం. 53.
డిస్ట్రిబ్యూటర్స్:
పెట్రర్, పెట్రర్-ఫీల్డింగ్ ఆయిల్ ఇంజన్సు, కిర్లోస్కర్
పంపులు చెరకు గానుగలు